బిసి రిజర్వేషన్లపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన నిర్వహించి, శాసనసభలో ఏకగ్రీవంగా బిల్లును రూపొందించి కేంద్రానికి పంపించిందని గుర్తు చేశారు. ఆర్నెల్లైనా రాష్ట్రపతి నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని విమర్శించారు. గతంలో కొన్ని తీర్పులలో సుప్రీంకోర్టు చెప్పిన ప్రకారం రాష్ట్రపతి అయినా సరే మూడు నెలల్లోగా తేల్చాలనీ, లేదా వెనక్కి పంపించాలని ఆదేశాలున్నాయని తెలిపారు. కానీ ఇది జరగలేదని పేర్కొన్నారు. మూడు నెలలు పూర్తయినందున చట్టంగా తీసుకోవచ్చని సుప్రీంకోర్టు చెప్పినందున 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసుకునే అవకాశముందని తెలిపారు. అలా సాధ్యం కాకపోతే, మొత్తం బిసిల రిజర్వేషన్ల మీద కేంద్ర ప్రభుత్వంతో పోరాడి బిల్లును అమలు చేసే విధంగా తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చే విధంగా పోరాటం సాగించాలని ఆయన పిలుపునిచ్చారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయబద్ధంగా చేయాల్సిన ప్రయత్నం చేస్తూనే, కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి సాధించడం కోసం ఉద్యమాన్ని కొనసాగించాలని కోరారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని రూపొందించాలని సూచించారు. అఖిలపక్షం తీసుకున్న ఉద్యమానికి సిపిఎం పూర్తిగా మద్దతిస్తుందని తెలిపారు.

రాష్ట్రంలో బిజెపికి ఎనిమిది మంది ఎంపిలు, ఇద్దరు మంత్రులు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలున్నారని జాన్‌వెస్లీ పేర్కొన్నారు. వీళ్లందరూ రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు అనుకూలంగా మాట్లాడుతూ, కేంద్రంలో మాత్రం వ్యతిరేకంగా ఉంటున్నారని విమర్శించారు. కేంద్రంమీద మీద ఒత్తిడి తెచ్చి అమలు చేయించాల్సిన బాధ్యత బిజెపి నాయకులు, ఆ పార్టీ ఎంపిలు, మంత్రుల మీద ఉందని తెలిపారు. అమలు జరగకపోతే వారే బాధ్యత వహించి పదవులకు రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి మనువాద పార్టీ, రిజర్వేషన్లకు వ్యతిరేకమైన పార్టీ అని విమర్శించారు. బిజెపి ఇదే వైఖరి కొనసాగిస్తే రాష్ట్రంలో జూబ్లీహిల్స్, స్థానిక సంస్థల ఎన్నికలే కాదు, ఏ ఎన్నికలు జరిగినా ఆ పార్టీకి ఓట్లు వేయకుండా సామాజిక తరగతులన్నీ తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న మారం జగదీశ్వర్

పెండింగ్ డిఎలను విడుదల చేయాలి

- టిపిటియు రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలను వెంటనే విడుదల చేయాలని టిపిటియు రాష్ట్ర కార్యవర్గం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉద్యోగ జెఎసి చైర్మన్, టిఎన్‌జిఒ అధ్యక్షులు మారం జగదీశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ జెఎసి నిరంతరం పోరాడుతుందని చెప్పారు. ప్రభుత్వంతో చర్చల కారణంగా ఉద్యోగుల ఆరోగ్య కార్డులు, డిఎల విడుదల త్వరలో పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటైందని అన్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, పిఆర్‌సిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాలకు సన్నద్ధమవుతామని హెచ్చరించారు. అధ్యక్షత వహించిన టిపిటియు రాష్ట్ర అధ్యక్షులు మట్టపల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిఆర్‌సి నివేదికను వెంటనే తెప్పించుకోవాలనీ, 2023, జులై ఒకటో తేదీ నుంచి అమలు చేయాలని కోరారు. ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను అమలు చేసి పదోన్నతులను కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలనీ, తరగతి గదికి ఒక టీచర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జిఒ ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ, టిపిటియు వ్యవస్థాపకులు జి వేణుగోపాలస్వామి, ప్రధాన కార్యదర్శి పి చంద్రశేఖర్, అదనపు ప్రధాన కార్యదర్శి కె సారయ్య, గౌరవ సలహాదారు గుండం మోహన్‌రెడ్డి, భూపతి శ్రీనివాస్, సోమ్లనాయక్, నర్సింగ్‌రావు, గురుప్రసాద్, నిమ్మల శ్రీనివాస్, రమేష్, భుజంగం, రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని ముజ్జుగూడెం నుంచి గువ్వలగూడెం వరకు రూ. 2.60 కోట్ల అంచనాతో నిర్మించనున్న రోడ్డు, పైనంపల్లి గ్రామంలో అంతర్గత సిసి రోడ్డు నిర్మాణాలకు శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రైతును రాజు చేయడం, పేదలకు సొంతింటి కల నెరవేర్చడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. అప్పుల కుప్పగా మార్చిన రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రమక్రమంగా ఒక్కొక్కటి గాడిన పెడుతోందన్నారు. అభివృద్ధి పనుల్లో ఎటువంటి లోటు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామన్నారు. పదేళ్లు రేషన్ కార్డు లేక ప్రభుత్వ ఫలాలు అందక అవస్థలు పడిన పేదలందరికీ రేషన్ కార్డులు అందించామన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మరింత ముందుకు సాగుతామని తెలిపారు. అనంతరం నేలకొండపల్లి మండల కేంద్రంలో ఇటీవల గ్రూప్-2 ఫలితాల్లో ఎక్సైజ్ ఎస్సైగా ఉద్యోగం సాధించిన దగ్గుల నాగ అమృతను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శాఖమూరి రమేష్ తదితరులు ఉన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిన్నారెడ్డి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం కోసం ప్రభుత్వమే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి చిన్నారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. "రాష్ట్రంలో వేలాది మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే, వారిని ప్రయివేటు ఏజెన్సీలు నియమించడం వల్ల శ్రమ దోపిడీకి గురవుతున్నారు. రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు ఈపీఎఫ్, ఈఎస్‌ఐ వంటి సదుపాయాలను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కల్పించడం లేదు. 20శాతం వరకు వేతనాల్లో కోత విధించడంతో పాటూ, జీతాలు కూడా ఆలస్యంగా ఇస్తున్నారు. ఉత్తర్ ప్రదేశ్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ఇటీవల కేబినెట్ తీర్మానం చేసింది. తెలంగాణలో కూడా అదే తరహా అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి" అని లేఖలో పేర్కొన్నారు.

తెలంగాణ ఐకానిక్‌గా టి స్క్వేర్ నిర్మాణం

- నవంబర్ చివర నాటికి నిర్మాణ పనులు ప్రారంభం
- ఎఐ సంస్థల ప్రతినిధులతో బోర్డు ఏర్పాటు
- సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టి స్క్వేర్ నిర్మాణం తెలంగాణ ఐకానిక్‌గా ఉండాలని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎఐ హబ్, టీస్క్వేర్ ప్రాజెక్టులపై హైదరాబాద్‌లోని ఐసిసిసిలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ, టిజిఐఐసి సంయుక్తంగా ఈ రెండు ప్రాజెక్టులు చేపడుతున్నాయి. రాయదుర్గం సమీపంలో చేపట్టనున్న టీస్క్వేర్ నిర్మాణ పనులను నవంబర్ నెలాఖరుకు ప్రారంభించాలని సిఎం దిశా నిర్దేశం చేశారు. టీస్క్వేర్‌లో ఆపిల్ వంటి అంతర్జాతీయ సంస్థల అవుట్‌లెట్లు ఉండాలన్నారు. ఎఐ హబ్ తాత్కాలిక ఏర్పాటు కోసం ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ భవనాలను పరిశీలించాలని సూచించారు. ఎఐ హబ్ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రముఖ ఎఐ సంస్థల ప్రతినిధులతో బోర్డు ఏర్పాటు చేయాలని సిఎం ఆదేశించారు. సమావేశంలో ఐటి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, సిఎంవో అధికారులు పాల్గొన్నారు.

బిసి రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు....

బిసి రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోవాలని నిర్ణయించింది. హైకోర్టు ఇచ్చిన స్టేపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని కీలక నిర్ణయం తీసుకుంది. జిఒ 9 అమలు కోసం మరోసారి సుప్రీంకోర్టు మెట్లు ఎక్కాలని నిర్ణయించింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని సిఎం రేవంత్‌రెడ్డి నివాసంలో సమావేశమై... హైకోర్టు ఆర్డర్ కాపీపై సమగ్రంగా చర్చించారు. న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపారు. అనంతరం ప్రభుత్వం సుప్రీం తలుపుతట్టాలని నిర్ణయం తీసుకుంది.

అనుమానాలు...అవరోధాలు...

రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్న నేపథ్యంలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బిసిల రిజర్వేషన్ల అమలులో అనేక అవరోధాలు ఎదురయ్యే అవకాశాలున్నాయి. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదనే నిబంధన ఉన్నది. ఈ విషయాన్ని అంగీకరిస్తూ...కోర్టులు తీర్పు కూడా ఇచ్చాయి. దీనిపై నిర్ణయం తీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. తమకు అనుకూలంగా ఉన్న అంశాలను ఆర్డినెన్స్ ద్వారా అమలు చేస్తున్నది. కానీ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లును మాత్రం ఆమోదించడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది. గతంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టులో విచారణ జరుగుతుండగా సుప్రీంకోర్టుకు ఎలా వస్తారని ప్రశ్నించడంతోపాటు దీనిపై విచారణ జరపలేమని సుప్రీం పేర్కొంది. హైకోర్టు తీర్పు వచ్చిన తర్వాత సుప్రీంకోర్టుకు రావాలని సూచించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల జిఒను, ఎన్నికల నోటిఫికేషన్ అమలును నిలిపివేస్తూ హైకోర్టు స్టే ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని రేవంత్ సర్కారు నిర్ణయించింది.


సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేసి ఎన్నికల నిర్వహణకు అనుమతి కోరనుంది. ఈ మేరకు సీనియర్ కౌన్సిల్‌తో వాదనలు వినిపించాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించినట్టు సమాచారం. దీంతో సోమవారం పిటిషన్ దాఖలు చేయనుంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం అసమర్థత వల్లే హైకోర్టులో తీర్పు బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వచ్చిందంటూ బిఆర్ఎస్, బిజెపి పార్టీలతోపాటు కొన్ని బిసి సంఘాలు కూడా ఆరోపిస్తున్నాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆది నుంచి రిజర్వేషన్ల అమలు కోసం అనేక ప్రయత్నాలు చేసిన సంగతి తెలిసిందే.

పట్టువీడం...బెట్టు చేయం

ఎన్నికల ప్రక్రియ, నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభమైనందున ఇందులో హైకోర్టు జోక్యం సరికాదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ప్రధానంగా వాదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా జనాభా గణాంకాలపై సర్వే నిర్వహించి, బిసిల జనాభా 57.6శాతం ఉన్నందున 42 శాతం రిజర్వేషన్లు కల్పించామని, దీనికి అనుగుణంగా రిజర్వేషన్ల పరిమితిని సవరిస్తూ చట్టం తీసుకువచ్చిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. బీసీ రిజర్వేషన్ల విషయంలో సర్కారు చేస్తున్న ప్రయత్నాలకు అడ్డంకులు వస్తున్నాయి. ఈ విషయంలో కేంద్రంలోని బిజెపి సర్కారు కనికరించడం లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కోర్టు మెట్లెక్కినా నిరాశే మిగిలింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి గండిపడింది. అసెంబ్లీ ఎన్నికల్లో బిసిలకు ఇచ్చిన హామీ నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పట్టువీడం... బెట్టు చేయం..అన్న విధంగా తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నది.

ప్రణాళికతో అభివృద్ధి పనులు

- ఏటూరునాగారం ప్రాంతాన్ని మున్సిపాల్టీ చేస్తాం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ప్రతి గ్రామానికీ ఒక ప్రణాళిక ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుం దని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఏటూరునాగారం ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, రానున్న రోజుల్లో మున్సిపాలిటీగా మారుస్తామని చెప్పారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణానికి శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేసుకోవాలని సూచించారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కూరగాయల మార్కెట్ నిర్మాణం చేస్తున్నామని అన్నారు. గతంలో ఏటూరునాగారం, ములుగు రెండు ప్రాంతాల మధ్య బస్సు డిపో విషయంలో సమస్య తలెత్తిందని, సంబంధిత అధికారులు, రవాణా శాఖ మంత్రితో చర్చించి ఏటూరునాగారం ప్రాంతంలో బస్ డిపో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏటూరునాగారం నుంచి గోదావరి నది వరకు సిసి రోడ్డు మంజూరు చేశామన్నారు. రానున్న రోజులలో మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ.. వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం చేపడుతున్నామని, రాబోయే రోజుల్లో పూర్తిస్థాయిలో గ్రౌండ్, స్విమ్మింగ్ పూల్ వంటి అభివృద్ధి పనులను చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, పంచాయతీ రాజ్ ఇఇ అజయ్ కుమార్, నాయకులు ఇర్సవడ్ల వెంకన్న, చిటమట రఘు, వావిలాల ఎల్లయ్య, లాలయ్య, సులేమాన్, గౌస్, ఖలీల్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఆయుర్వేద ఇనిస్టిట్యూట్‌ను మంజూరు చేయాలి

- కేంద్రానికి మంత్రి దామోదర రాజనర్సింహ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణకు జాతీయ స్థాయి ఆయుర్వేద ఇనిస్టిట్యూట్‌ను మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విజ్ఞప్తి చేశారు. 2030 నాటికి దేశంలో పది ఆల్ ఇండియా ఆయుర్వేద ఇనిస్టిట్యూట్స్‌ను నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో ఒకటి తెలంగాణలో ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర ఆయుష్, ఆరోగ్యశాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్‌కు మంత్రి దామోదర లేఖ రాశారు. తెలంగాణ అడవుల్లో అద్భుతమైన ఆయుర్వేద సంపద ఉందనీ, ఔషధ విలువలున్న మూలికలు, మొక్కల జాతులు ఉన్నాయని మంత్రి ఆ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో సాంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానాలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇటీవలే సుమారు 800 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించామని వెల్లడించారు. ఆయుష్ హాస్పిటళ్లను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వందల సంవత్సరాలుగా ఆయుష్ వైద్య విధానాలకు మంచి ప్రాచుర్యం ఉన్నదని, ఇక్కడి ప్రజలు ఆయుష్ వైద్య సేవలను కూడా వినియోగించుకుంటున్నారని మంత్రి చెప్పారు. కేంద్రం ఏర్పాటు చేయబోయే ఆయుర్వేద ఇనిస్టిట్యూట్‌కు అవసరమైన భూమి, ఇతర వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి వివరించారు. ఈ మేరకు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు శనివారం హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర మంత్రి ప్రతాప్‌రావు జాదవ్‌ను కలిసి లేఖను అందజేశారు.

వరంగల్, నల్లగొండ జిల్లాల్లో ఇంక్యూబేషన్ కేంద్రాలు

- 'టీ-హబ్' తరహాలో ఏర్పాటు, కొత్త ఆలోచనలకు ప్రోత్సాహం
- మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటి రెడ్డి వెంకటరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


ఒప్పందం కుదుర్చుకుంటున్న మంత్రులు

వరంగల్, నల్లగొండలోనూ టీ-హబ్ తరహాలో ఇంక్యూబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నట్టు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి త్వరలోనే కాకతీయ, మహాత్మాగాంధీ విశ్వ విద్యాలయాలతో ఎంఒయు కుదుర్చుకోనున్నట్టు వివరించారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న 'కాకతీయ యూనివర్సిటీ ఫార్మా అలుమ్ని' గోల్డెన్ జూబ్లీ వేడుకలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్‌కు మానవత్వాన్ని జోడిస్తే ప్రతి ఆవిష్కరణ సమాజహితానికి బాటలు వేస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణను గ్లోబల్ ఫార్మా, లైఫ్ సైన్సెస్ హబ్‌గా మాత్రమే కాకుండా 'ఫార్మసీ ఆఫ్ పర్పస్'గానూ మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. రీసెర్చ్‌ను మార్కెట్‌కు, పాలసీని రోగికి అనుసంధానించే సమగ్రమైన 360 డిగ్రీల ఎకో సిస్టమ్ ను అభివ ద్ధి చేస్తున్నామన్నారు. 18 నెలల్లోనే లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్తగా రూ.54వేల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు. ఎలీ లిల్లీ లాంటి అంతర్జాతీయ ఫార్మా దిగ్గజ కంపెనీలను తెలంగాణకు తీసుకొచ్చి, ఇక్కడి యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు.డాక్టర్ల కంటే వేగంగా రోగాలను నిర్ధారించినా, అనుభూతి చెందే మనసును మాత్రం ఏ యంత్రం భర్తీ చేయలేదన్నారు. దేశంలో తమ అనుభవాన్ని 'నాలెడ్జ్ ఇన్వెస్ట్ మెంట్'గా పెట్టేందుకు ముందుకు రావాలని ప్రవాసీ భారతీయ నిపుణులకు విజ్ఞప్తి చేశారు. పేటెంట్లను కాకుండా మీ ఆవిష్కరణ వల్ల ఎంత మందికి మేలు జరిగిందన్నదే చరిత్ర గుర్తుంచుకుంటుందని యువ ఇన్నోవేటర్స్ కు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ కె ప్రతాప్ రెడ్డి, డా.బి ప్రభా శంకర్, రాంప్రసాద్ రెడ్డి, ప్రద్యుమ్న, డా తామర విజయ్ కుమార్, ప్రొఫెసర్ భాస్కర్ ఆర్ జాస్తి, రాజేశ్వర్ తోట, ప్రొఫెసర్ జె కృష్ణవేణి పాల్గొన్నారు.

గురుకులాలకు పదేళ్లలో ఏం చేశారు?

- బిఆర్‌ఎస్‌ది బురదచల్లే రాజకీయం
- మంత్రి అడ్లూరి లక్ష్మణ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బిఆర్‌ఎస్ గురుకులాలకు చేసిందేంటి? మెస్, డైట్ ఛార్జీలు పెంచారా? మౌలిక వసతులు కల్పించారా? కొత్త భవనాలను నిర్మించిందా? అని ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, బిఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ మంత్రులు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదచల్లే రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సహా నాటి మంత్రులెవరైనా గురుకులాలను సందర్శించారా? సంక్షేమ గురుకులాల్లో చదివే పిల్లలతో కలిసి భోజనం చేశారా? అని నిలదీశారు. శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తామే రాజులం, మంత్రులం అన్నట్టు వ్యవహరించి గురుకులాలను, విద్యావ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు. గురుకులాలకు బిఆర్‌ఎస్ చేసిందేమి లేదని తెలిపారు. కాంగ్రెస్ సర్కారుపై విమర్శలు చేసే ముందు గురుకులాలకు బిఆర్‌ఎస్ చేసిందేమైనా ఉంటే చెప్పాలని సవాల్ విసిరారు. బిఆర్‌ఎస్ హయాంలో బాసర ట్రిబుల్ ఐటీలో విద్యార్థులు రోజుల తరబడి నిరసన తెలిపినా పట్టించుకోలేదని గుర్తుచేశారు. ప్రగతిభవన్, నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు క్యాంపు కార్యాలయంలో, జిల్లాల్లో కలెక్టరేట్ల సముదాయాల నిర్మాణాలకు ప్రాధాన్యమిచ్చారే గానీ గురుకులాల వైపు



చూడలేదని తెలిపారు. గత ప్రభుత్వం సాంఘిక సంక్షేమ, బిసి సంక్షేమ మంత్రులిద్దరు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఉన్నా ఆ జిల్లాల్లో ఒక్క కొత్త భవనం నిర్మాణం చేయలేదని ఎద్దేవా చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి గురుకులాలను సందర్శించారనీ, భోజనం చేశారనీ, సంక్షేమ విద్యార్థుల తక్షణ అవసరాలను తీర్చడానికి వీలుగా సీఎం సహాయ నిధి నుంచి రూ.60 కోట్లు విడుదల చేశారని మంత్రి ధన్యవాదాలు తెలిపారు. నిధులు విడుదల చేయడం సీఎంకు సంక్షేమంపై ఉన్న అంకితభావానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం మెస్ ఛార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు పెంచి అదనంగా రూ.48,438.84 లక్షల భారం భరిస్తున్నదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బాచుపల్లి, గొల్లపల్లి (జగిత్యాల) ప్రాంతాల్లో కొత్త భవనాల నిర్మాణం ప్రారంభమైందని తెలిపారు. తమ పాలనలో ఇచ్చిన ప్రత్యేక శిక్షణతో 186 విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర సర్వీసులకు ఎంపికయ్యారని తెలిపారు.

స్పీడ్ రెస్పాన్స్-ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటు

ప్రతి సొసైటీ సెక్రటరీకి నిధుల వినియోగంపై పూర్తి అధికారం ఇచ్చినట్టు మంత్రి తెలిపారు. "ఫాస్ట్ యాక్షన్ మెకానిజం" ఏర్పాటు చేసి, ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తీసుకునే విధానం అమల్లోకి వస్తోందని చెప్పారు. హాస్టళ్లలో ఆహార నాణ్యత, మెడికల్ చెకప్‌లు, సానిటేషన్‌పై ప్రత్యేక పర్యవేక్షణ. ప్రతి వారం ఇన్‌స్పెక్షన్‌లు నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపేవిధంగా చర్యలు చేపట్టినట్టు వెల్లడించారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిని డిజిటల్‌గా మానిటర్ చేసే ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటవుతోందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సొసైటీ స్థాయిలో పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ల సమన్వయంతో సొసైటీ స్థాయిలో చర్యలు తీసుకునే వీలు కలుగుతుందన్నారు.

విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు

బెస్ట్ అవైలబుల్ స్కీం అమలవుతున్న ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. మానవత్వంతో ఆలోచించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లి మొదటి దఫాలో ఈ నెల 20లోపు, మిగిలిన బిల్లులను ఈ నెల చివరిలోగా క్లియర్ చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

పర్యాటకుల రక్షణకు టూరిస్ట్ పోలీస్ వింగ్

- టిజిటిడిసి ఎండి వల్లూరి క్రాంతి వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో టూరిస్ట్ పోలీస్ వింగ్‌ను ఏర్పాటు చేసినట్టు తెలంగాణ టూరిస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిటిడిసి) ఎండి వల్లూరి క్రాంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటకుల మెరుగైన భద్రత కోసం ఈబ వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మొదటి విడతలో భాగంగా 80 మందికి అక్టోబర్ ఆరు నుంచి తొమ్మిది వరకు హైదరాబాద్‌లోని నితమ్‌లో "పర్యాటక పోలీసుల ధోరణి... సున్నితత్వం"పై ప్రత్యేక శిక్షణ అందించినట్టు తెలిపారు. యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం, పోచంపల్లి, కీసరగుట్ట, సాలార్ జంగ్ మ్యూజియం, చార్మినార్, గోల్కొండ భద్రాచలం, రామప్ప దేవాలయం, సమ్మక్క సారలమ్మ దేవాలయం, బుద్ధవనం, సోమశిల దేవాలయం తదితర ప్రాంతాల్లో నియమిస్తున్నట్టు తెలిపారు.

14 నుంచి ముంబయిలో ఐఎఫ్‌ఎటి ప్రదర్శన

ముంబయి : నీరు, మురుగునీరు, ఘన వ్యర్థాలు, రీసైక్లింగ్ టెక్నాలజీలకు సంబంధించిన దేశంలోనే అతిపెద్ద వాణిజ్య ప్రదర్శన అయిన ఐఎఫ్‌ఎటి ఇండియా 2025 అక్టోబర్ 14 నుండి అక్టోబర్ 16 వరకు ముంబయిలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. ఇందులో 30 కి పైగా దేశాల నుండి 500 కి పైగా ప్రదర్శనలు ఉన్నాయని ఐఎంఇఎ ప్రెసిడెంట్ భూపిందర్ సింగ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 50 కి పైగా దేశాల నుండి 28,000 కి పైగా వాణిజ్య సందర్శకులు వస్తారని అంచనా వేశారు.

75పైగా స్టార్టప్‌లకు కోటక్ బిజ్‌ల్యాబ్స్ మద్దతు

హైదరాబాద్ : కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ తన కోటక్ బిజ్ ల్యాబ్స్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ సీజన్ 2ను ప్రారంభించినట్లు తెలిపింది. ఇది 75 పైగా ప్రారంభ దశ స్టార్టప్‌లకు మార్గదర్శకత్వం, మార్కెట్ యాక్సెస్, ఉత్ప్రేరక నిధులు తదితర వాటికి మద్దతు ఇవ్వడానికి రూపొందించబడిందని కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ సిఎస్‌ఆర్ అండ్ ఇఎస్‌జి హెడ్ హిమాన్షు నివ్‌సర్కార్ తెలిపారు. అక్టోబర్ నుండి నవంబర్ 2026 వరకు జరిగే ఈ సీజన్ 2 భారతదేశం అంతటా 75పైగా స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వనుందన్నారు. తొలి సీజన్‌లో 1500పైగా దరఖాస్తులు రాగా.. 55 స్టార్టప్‌లకు మద్దతును అందించామన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో టాటా పంచ్‌కు ఆదరణ

హైదరాబాద్ : దేశంలో అత్యధికంగా అమ్ముడుపోయిన ఐదు కార్లలో టాటా పంచ్ ఒక్కటిగా ఉందని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టిఎంపివి) వెల్లడించింది. పెట్రోల్, సిఎన్‌జి, విద్యుత్ వేరియంట్లలో లభించే పంచ్‌కు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆధారణ లభించిందని పేర్కొంది. 2025 ఏప్రిల్ నుండి సెప్టెంబర్ 2025 వరకు టిఎంపివి మొత్తం విక్రయాల్లో తెలంగాణలో 21 శాతం వాటా, ఆంధ్రప్రదేశ్‌లో 25 శాతం వాటాను సాధించి.. రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రియమైన కారుగా నిలిచిందని ఆ కంపెనీ పేర్కొంది.

బంగారం కోసం మహిళపై దాడి

- బాధితురాలి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై దుండగులు తీవ్రంగా దాడి చేసి బంగారం దోచుకెళ్లారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా హాలియా మండలం కొత్తపల్లి గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన ఐతగోని సత్తమ్మ శుక్రవారం మధ్యాహ్నం ఒంటరిగా ఇంట్లో ఉండగా.. దుండగులు ఇంట్లోకి ప్రవేశించి ఆమెపై దాడి చేసి బంగారాన్ని దోచుకెళ్లారు. ఆమె ప్రతిఘటించగా.. దుండగులు తీవ్రంగా కొట్టారు. బాధితురాలి భర్త ఇంటికి వచ్చి చూసేసరికి సత్తమ్మ తీవ్ర గాయాలతో స్పృహ కోల్పోయి కనిపించింది. వెంటనే ఆమెను హాలియాలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐ సతీష్ రెడ్డి ఎస్‌ఐ సాయి ప్రశాంత్ ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. బంగారం కోసం ఇంటి దొంగలే ఈ పని చేసి ఉంటారని పోలీసులు, గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పోలీసులు పలువురు అనుమానితులను విచారిస్తున్నారు.

పత్తి చేనులో గంజాయి సాగు

- ధ్వంసం చేసిన పోలీసులపై తండావాసుల దాడి!

నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

పత్తి చేనులో మిశ్రమ పంటగా వేసిన గంజాయి మొక్కలను ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేయడంతో తండావాసులు వారిపై దాడి చేశారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం చల్లగిద్ద తండాలో శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. చల్లగిద్ద తండాకు చెందిన జాకీరామ్ పత్తి చేనులో గంజాయి మొక్కలను సాగు చేసినట్టు నారాయణఖేడ్ ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. దాంతో వారు అక్కడికి వెళ్లి గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. నిందితుడు జాకీరామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అలాగే, తండాకు చెందిన పవిత్ర దశరథ్, పవిత్ర మోహన్ ఇంటిపై దాడి చేసి 4.2 కిలోల ఎండు గంజాయిని, 1.5 కిలోల గంజాయి విత్తనాలను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. నిందితులిద్దరూ పరారీలో ఉన్నారు. ఈ క్రమంలో తండావాసులు అధికారులను, సిబ్బందిని దుర్భాషలాడుతూ దాడులు చేసి గాయపర్చారు. పోలీసుల ఫోన్లను కూడా లాక్కున్నారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ వెంకటరెడ్డి పోలీసు సిబ్బందితో తండాకు వెళ్లి తండావాసులతో చర్చించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సీఐ రఘునాథ్ రెడ్డి చెప్పారు.



మహిళపై లైంగికదాడి

- ఆ తర్వాత చెట్టుకు కట్టేసిన దుండగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుర్తు తెలియని వ్యక్తులు ఓ మహిళపై లైంగికదాడి చేసి చెట్టుకు కట్టేశారు. ఈ ఘటన శనివారం మెదక్ జిల్లా కొల్చారం మండలం అప్పాజీపల్లి శివారులో వెలుగు చూసింది. గ్రామస్తులు, కొల్చారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ మండలం జానకంపల్లి పంచాయతీ పరిధిలోని ఓ తండాకు చెందిన మహిళపై దుండగులు లైంగికదాడికి ఒడిగట్టారు. ఆ తర్వాత పాతంశెట్టిపల్లి టీ జంక్షన్ నుంచి ఏడుపాయలకు వెళ్లే దారిలో ఖాళీ స్థలం వెనుక చెట్టుకు కట్టేశారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న కొల్చారం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధిత మహిళను మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ జార్జ్, కొల్చారం ఎస్ఐ మహ్మద్ మోహినుద్దీన్, పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ సందర్శించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కొల్చారం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- సిఐటియు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ మహాసభ ప్రారంభం
- కార్మిక ప్రదర్శన



మహాసభలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికుల హక్కుల పరిరక్షణ పోరాటంలో సిఐటియు ఎల్లప్పుడూ ముందడుగు వేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. సిఐటియు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ 16వ మహాసభ శనివారం ప్రారంభమైంది. బంజారాహిల్స్ జిబికె మాల్ నుంచి రాయల్ ఫంక్షన్ హాల్ వరకు సాగిన కార్మిక ప్రదర్శనను సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ ప్రారంభించారు. అనంతరం సిఐటియు జెండాను గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు కుమారస్వామి ఎగురవేశారు.

ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో లేబర్ కోడ్లను తీసుకురావడం ద్వారా కేంద్ర ప్రభుత్వం.. యజమానుల చేతుల్లో కార్మికులను బానిసలుగా మార్చుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఎనిమిది గంటల పని విధానం స్థానంలో 12 గంటల పని విధానాన్ని మోడీ సర్కార్ ప్రవేశపెట్టిందని తీవ్రంగా విమర్శించారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26,000 ప్రకటించాలని దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు పోరాడుతున్నా, కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా యజమానుల పక్షం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రైతులకు వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలు తెచ్చిన మోడీ సర్కార్.. అన్నదాతల ఉద్యమాలతో వెనక్కి తగ్గిందని, అదే విధంగా లేబర్ కోడ్‌లను రద్దు చేసేవరకు కార్మిక వర్గం దేశవ్యాప్తంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం అడుగుజాడల్లో నడుస్తూ జిఒ 282 ద్వారా కార్మికులను పది గంటలు పని చేయించాలని ఆదేశించడం అన్యాయం అన్నారు. ఆ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యాజమాన్యాల ఒత్తిడితో కనీస వేతనాలను పెంచకుండా నోటిఫికేషన్‌లు విడుదల చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర-రాష్ట్ర కార్మిక సంఘాలకు కనీస వేతన మండలిలో ప్రాతినిధ్యం ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం వెంకటేష్, కోశాధికారి కె అజయ్ బాబు, ఉపాధ్యక్షులు సి మల్లేష్, జి రాములు, టి మహేందర్, సహాయ కార్యదర్శులు ఎం సత్యనారాయణ, పి శ్రీనివాస్, నగర కమిటీ సభ్యులు ఎస్ శోభ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహుని సన్నిధిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని శనివారం తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్‌సింగ్ దర్శించుకున్నారు. ఆయనతోపాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె లక్ష్మణ్, జస్టిస్ కె శరత్, జస్టిస్ కె సుజన, జస్టిస్ వి రామకృష్ణారెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యనిర్వాహణాధికారి జి రవి ఆధ్వర్యంలో స్వామి వారి దర్శన ఆశీర్వచన ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు వారికి సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వారికి ప్రసాదం, ఫొటోలను ఇఒ అందజేశారు. ఈ సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. నరసింహుని దర్శనం తన అదృష్టమన్నారు. ఆలయ నిర్మాణం అత్యంత అద్భుతమని, నిర్వహణ బాగుందని కొనియాడారు. అంతకుముందు కలెక్టర్ హనుమంతరావురావు ఆయనకు స్వాగతం పలికారు. వారి వెంట రాచకొండ సిపి సుధీర్ బాబు, ఆర్‌డిఒ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఎసిపి శ్రీనివాస్‌నాయుడు, తహసీల్దార్ గణేష్ నాయక్, అధికారులు ఉన్నారు.

అంబేద్కర్ సందేశాన్ని అందించిన సంఘం శరణం గచ్ఛామి

ప్రజాశక్తి- కల్చరల్

బాబా సాహెబ్ అంబేద్కర్ అంటే నిమ్న వర్గాల ప్రతినిధి అని భారత రాజ్యాంగ రచయిత అని మాత్రమే అని దేశంలో ప్రాచుర్యంలో ఉంది. ఆయన విగ్రహాలు వాడ వాడలా ఉండటానికి కారణం కూడా ఇదే. కానీ అంబేద్కర్ ఒక్క దళిత వర్గ ప్రజల ప్రతినిధి కాదు ఆయన ఆలోచనలు అంతర్యం ఆవిష్కరించిన నాటకం సంఘం శరణం గచ్ఛామి. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై పీపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వహనలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారిచే డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర సంఘం శరణం గచ్ఛామి పేరిట నాటకం ప్రదర్శించారు. దేవేంద్ర రచించగా జగ్గరాజు దర్శకత్వం ప్రదర్శించారు. అంబేద్కర్ చిన్న నాడు ఎదుర్కొన్న వివక్షత మహారాజు సహకారంతో లండన్ అమెరికాలో ఉన్నత విద్య చదివినా తప్పనీ అంటరానితనం మహమ్మారిలతో ఉద్యమించిన నేపథ్యం ఆసక్తిగా ప్రతి దృశ్యంలో ఆవిష్కరించారు. స్వాతంత్ర పోరాటం సందర్భంలో హిందువులను కులాల వారీగా విడగొట్టరాదని గాంధీజీ ఆశయం ఇదే అంబేద్కర్ వివక్షత అనుభవిస్తున్న వారికి ప్రత్యేక హక్కులు ఇవ్వాలని కోరటం వారివురు మధ్య విభేదాలు. స్వాతంత్ర వచ్చిన తరువాత అంబేద్కర్ ప్రస్తుత దేశ పరిస్థితులు వివరిస్తూ మహిళలకి హక్కులు కల్పించాలని మైనారిటీ వర్గాల ప్రజలు ప్రస్తుత పాలనలో అనుభవిస్తున్న బాధలు, ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం కార్మికుల కర్షకులు కష్టాలు ప్రైవేట్ రంగం లో రిజర్వేషన్ లేని పరిస్తితి బిసిలకు రిజర్వేషన్స్ ఇట్టి పలు అంశాలుపై తన అవేదన వ్యక్తం చేస్తూ విగ్రహాలు కాదు తన ఆశయాలు అమలు చేయాలని ప్రసంగంతో నాటకం ముగుస్తుంది. జగ్గరాజు అంబేద్కర్‌గా నటన ఆహార్యం ఆకట్టుకుంది. ఇతర పాత్రలో నటీ నటులు నాటకాన్ని రక్తి కట్టించారు. నాటకం ఆసాంతం చూసిన విశ్రాంత సివిల్ సర్వీస్ అధికారి అర్జునరావు మాట్లాడుతూ కెకె రాజా మంచి నాటకాన్ని ప్రజల మధ్యకు తీసుకు వెళుతున్నారని అభిందించారు. ప్రజల్లో చైతన్యం లేనంత కాలం న్యాయమూర్తిపైకి బూటు విసరటం ఐపిఎస్ అధికారి కుల వివక్షతతో ఆత్మహత్య చేసుకోవటం వంటి సంఘటనలు జరిగాయని అవేదన వ్యక్తం చేశారు మరొక సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి జెడి శీలం మాట్లాడుతూ వెనుక బడిన యువత చదువుకొన్నా బానిస మనస్తత్వంతో ఉంటున్నారని అంబేద్కర్‌కు జై కొట్టటం కాకుండా ఆయన త్యాగాలు ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. కెకె రాజా పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమలో విశ్రాంత ఉన్నత అధికారులు మహీంద్ర, అర్ సుబ్బారావు, పి ఎస్ ఎన్ మూర్తి, వాణిజ్య పన్నుల శాఖ ఉన్నత అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన, సంక్షేమ శాఖ డైలీవేజ్ పిఎంహెచ్ వర్కర్ల సమ్మెలో

రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

- విద్యార్థి, ఉపాధ్యాయ, గిరిజన సంఘాల డిమాండ్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేతనాల తగ్గింపును నిరసిస్తూ మినిమం టైంస్కేల్ అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 12 నుంచి గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని డైలీవేజ్ పిఎంహెచ్ వర్కర్లు చేస్తున్న నిరవధిక సమ్మెలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని విద్యార్థి, ఉపాధ్యాయ, గిరిజన సంఘాల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. తక్షణమే సమ్మె చేస్తున్న కార్మికులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించి లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరింది. శుక్రవారం హైదరాబాద్‌లోని సిఐటియు కార్యాలయంలో డైలీవేజ్, పిఎంహెచ్ వర్కర్ల నిరవధిక సమ్మెకు మద్దతుగా జెఎసి నాయకులు మాడే పాపారావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి రవికుమార్, మైదాన ప్రాంత గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ నాయక్, తెలంగాణ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె వెంకటేష్‌లు మాట్లాడారు. నెల రోజులుగా గిరిజన సంక్షేమ శాఖలో 3,000 మంది డైలీవేజ్, పిఎంహెచ్ వర్కర్లు సమ్మె చేస్తుంటే వారి సమస్యలను పరిష్కరించడంలో, కనీసం వారితో చర్చలు కూడా జరపకుండా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని విమర్శించారు. గిరిజన సంక్షేమ శాఖలో హాస్టల్స్, ఆశ్రమ పాఠశాలలు పిఎంహెచ్‌ల నిర్వహణలో గత 35 సంవత్సరాలుగా డైలీవేజ్, పిఎంహెచ్ వర్కర్ల పాత్ర గణనీయంగా ఉందని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నాలుగో తరగతి ఉద్యోగుల పోస్టులను మంజూరు చేయకుండా, రిటైర్మెంట్ అయిన వారి స్థానంలో కొత్తవారిని నియమించకుండా డైలీవేజ్, కంటన్‌జెంట్ వర్కర్లతో గత 35 సంవత్సరాలుగా పని చేయించుకుంటున్నారని చెప్పారు. సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వాలు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిన కారణంగానే కార్మికులు సమ్మెబాట పట్టాల్సి వచ్చిందని అన్నారు.

ఒకే శాఖలో ద్వంద్వ విధానాలా?

ఒకే శాఖలో ద్వంద విధానాలను అమలు చేస్తూ, ఒక దగ్గర టైంస్కేల్‌ని అమలు చేస్తూ, మరో దగ్గర అమలు చేయకపోవడం సరికాదని నాయకులు తెలిపారు. గత 30 సంవత్సరాలుగా జిల్లా కలెక్టర్ల గెజిట్‌ల ప్రకారం పొందుతున్న వేతనాలను 2021లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జిఒ 64 పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నాగర్ కర్నూల్, ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలో వేతనాలను తగ్గించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.26 వేల వేతనాన్ని రూ.11,700లకు తగ్గించటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత 35 సంవత్సరాలుగా పని చేస్తున్న వారెవరో తమకు తెలియదనీ, వారి పేర్లు తమ వద్ద లేవని ఆర్థిక శాఖ అధికారులు వితండవాద చేయడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 2008, 2010లో నాటి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరిపి వీరందరినీ రెగ్యులరైజ్ చేయాలని, ఆ తీర్మానానికి అనుగుణంగా కొత్త పోస్టులను శాంక్షన్ చేయాలని తీర్మానించారని గుర్తు చేశారు. తెలంగాణ వచ్చిన అనంతరం వారిని పర్మినెంట్ చేస్తారని ఆశపడితే జిఒ నెం.16లో డైలీవేజ్ అనే పదం లేదనే పేరుతో వీరు పర్మినెంట్ కాకుండా పోయారని వారు తెలిపారు.

అధికారుల వ్యవహారశైలితో గిరిజన హక్కులకు విఘాతం

గిరిజన సంక్షేమ శాఖ అధికారుల వ్యవహారశ్శైలితో వర్కర్ల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టుగా ఉందని వారు విమర్శించారు. అన్నారు. పర్మినెంట్ చేయాలని, టైంస్కేల్ ఇవ్వాలని అనేక సంవత్సరాలుగా ఆందోళన చేస్తుంటే అది చేయకపోగా ఉన్న జీతాలను తగ్గించి వారందరినీ అవుట్‌సోర్సింగ్‌లోకి మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్డున పడ్డ 26 వేల మంది

- ఎస్‌సి, ఎస్‌టి బెస్ట్ అవైలబుల్ స్కీం విద్యార్థులు
- 13న రౌండ్ టేబుల్ సమావేశం
- కెవిపిఎస్, టిజిఎస్, ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి రూ.220 కోట్లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 13న ఉద్యమ కార్యాచరణకై హైదరాబాదులో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, తెలంగాణ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీల ప్రధాన కార్యదర్శులు టి స్కైలాబ్ బాబు, ఆర్ శ్రీరాం నాయక్, టి నాగరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళిత, గిరిజన, విద్యార్థి, ప్రజా సంఘాలు హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక తరగతిలో ఒక్కో విద్యార్థికి ఏటా రూ.28 వేలు, ప్రాథమికోన్నత తరగతిలో వసతితో కలిపి రూ.42 వేల చొప్పున ఈ స్కీం కింద చెల్లించాల్సి ఉంటుందన్నారు. స్కీం పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 230 ప్రయివేటు పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.220 కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం బకాయి పడిందని చెప్పారు. బకాయిలు చెల్లించాలని దళిత, గిరిజన సంఘాలు విజ్ఞప్తి చేసినా రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి విడుదల చేయలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఈ పథకం పరిధిలోని 26 వేల మంది విద్యార్థులకు చదువు, భోజనం, వసతి కల్పించలేకపోతున్నామని ప్రయివేటు యాజమాన్యాలు వారిని పాఠశాలల్లోకి అక్టోబర్ ఆరు నుంచి అనుమతించడం లేదని తెలిపారు. దళిత, గిరిజన విద్యార్థులు రోడ్డున పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం మానవత్వం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్కీం పరిధిలో చదువుతున్న విద్యార్థులు గతంలో ఎప్పుడు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోలేదని తెలిపారు. బకాయిలను విడుదల చేయడంలో ఆర్థిక, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దళిత, గిరిజన శాసనసభ్యులు తక్షణం స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు విడుదల చేయించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని వారు హెచ్చరించారు. అక్టోబర్ 13న జరగబోయే రౌండ్ టేబుల్ సమావేశంలో అన్ని సంఘాలతో చర్చించి ఉద్యమ కార్యాచరణ చేపడతామని తెలిపారు.

నకిలీ నోట్ల చెలామణి ముఠా గుట్టురట్టు

- 8 మంది అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన ఎస్‌పి ఎం రాజేష్‌చంద్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నకిలీ నోట్లను చెలామణి చేస్తున్న ముఠాను కామారెడ్డి పోలీసులు పట్టుకున్నారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుల్లో ఎనిమిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు కామారెడ్డి జిల్లా ఎస్‌పి ఎం రాజేష్ చంద్ర తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి సిరిసిల్ల రోడ్‌లో గల శ్లోక వైన్స్‌లో ఈనెల 24న క్యాషియర్ మేకల అఖిల్‌కు ఓ వ్యక్తి రెండు రూ.500 నోట్లు ఇచ్చి ఐకానిక్ విస్కీ ఫుల్ బాటిల్ కొనుగోలు చేశాడు. అయితే, ఆ నోట్లు నకిలీవని తేలడంతో బాధితుడు కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఎఎస్‌పి బి చైతన్యరెడ్డి పర్యవేక్షణలో సిసిఎస్ ఇన్‌స్పెక్టర్, కామారెడ్డి పట్టణ ఇన్‌స్పెక్టర్ సారథ్యంలో ఎనిమిది బృందాలుగా ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. మొదటగా రామేశ్వరపల్లి గ్రామానికి చెందిన సిద్ధాగౌడ్‌ను పట్టుకొని విచారించారు. నకిలీ నోట్ల గుట్టు బయటపడింది. సులభంగా డబ్బులు సంపాదించాలనుకున్న సిద్ధాగౌడ్ ఆన్‌లైన్‌లో వెతికి వెస్ట్ బెంగాల్‌కు చెందిన సౌరవ్ డే అనే వ్యక్తికి కాంటాక్ట్ అయ్యాడు. గత నెల 18న కొరియర్ ద్వారా సిద్ధాగౌడ్‌కు 18 నకిలీ నోట్లు పంపాడు. అందులో నుంచి రెండు నోట్లతో శ్లోక వైన్స్‌లో మద్యం కొనుగోలు చేశాడు. సిద్ధాగౌడ్ ద్వారా సమాచారం సేకరించిన పోలీసులు సౌరవ్ డేను పట్టుకోవడానికి వెస్ట్ బెంగాల్ వెళ్లారు. గత నెల 27న సౌరవ్ డేను పట్టుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ నీటి దోపిడీకి సిఎం వత్తాసు

- మహారాష్ట్ర, కర్ణాటక తీరుతో రాష్ట్రానికి నష్టం
- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఆంధ్రప్రదేశ్ చేస్తున్న నీటి దోపిడికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వత్తాసు పలుకుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి జలాలను ఏపీ తరలించుకుపోతున్నా సిఎం ఎందుకు స్పందిచడం లేదని నిలదీశారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎపి 463 టిఎంసిల నీళ్లు మళ్లిస్తే, 112 టిఎంసిలు ఆపుకుంటామని కర్ణాటక అంటుండంగా, 74 టిఎంసిలు ఆపుకుంటామని మహారాష్ట్ర అంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కింద గోదావరి నీళ్లు ఎపి తీసుకుపోతే, పైన కృష్ణా నీళ్లు కర్ణాటక మళ్లించుకుంటే తెలంగాణ పరిస్థితేంటని ప్రశ్నించారు. "తెలంగాణకు బనకచర్ల పెను ప్రమాదంగా మారుతోంది. కేంద్రం అండతో ఎపి ప్రభుత్వం బనకచర్లపై ముందుకెళ్తోంది. రేవంత్‌రెడ్డి దీన్ని అడ్డుకోకపోగా.. పరోక్షంగా సహకరిస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాలను తుంగలో తొక్కుతున్నారు. బనకచర్లపై కేంద్రం లేఖ రాసి 20 రోజులవుతున్నా ప్రభుత్వం స్పందించలేదు. ప్రాజెక్ట్ డిపిఆర్‌ను పరిశీలిస్తున్నామని కేంద్ర మంత్రి లేఖ రాశారు. దీనిపై రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు స్పందించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది? సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లట్లేదు?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు. సిఎంగా ప్రజా ప్రయోజనాలు కాపాడతారా? స్వార్థ ప్రయోజనాలు చూసుకుంటారా? చెప్పాలని డిమాండ్ చేశారు. "మాట్లాడితే నల్లమల బిడ్డ అంటాడు. ఆ నల్లమలను అనుకొని పారే కృష్ణా నదిలో మహబూబ్ నగర్ జిల్లాకు నష్టం జరిగితే ఎందుకు మాట్లాడటం లేదు. నువ్వు నల్లమల పులివా.. పిల్లివా, ఎలుకవా.. ఎందుకు మాట్లాడటం లేదు. పులి అయితే మాట్లాడేవాడివి.. పిల్లివి, ఎలుకవు కాబట్టి మాట్లాడటం లేదు అని హరీశ్‌రావు ఘాటుగా విమర్శించారు. ఇప్పటి కైనా తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తూనే న్యాయపరంగా పోరాడాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.



జూనియర్ అసిస్టెంట్ల సర్వీస్ క్రమబద్ధీకరణకు గ్రీన్ సిగ్నల్

- జిల్లా కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేసిన సిసిఎల్ఎ
- టిజిజెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి హర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూనియర్ అసిస్టెంట్ల సర్వీసు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వారి సర్వీసు క్రమబద్ధీకరణపై కమిషనర్ ఆఫ్ ల్యాండ్ రెవెన్యూ అడ్మినిస్ట్రేషన్ (సిసిఎల్ఎ) కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేసింది. జూనియర్ అసిస్టెంట్ల నియామకం జరిగి రెండేళ్లు గడిచినా ఇప్పటి వరకు సర్వీసు క్రమబద్ధీకరణపై స్పష్టత లేదు. వారి క్రమబద్ధీకరణపై రెండేండ్లుగా తెలంగాణ ఉద్యోగుల జెఎసితో పాటు పలు సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చాయి. ఈ క్రమంలో సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. బదిలీ ద్వారా నియామకం అయిన జూనియర్ అసిస్టెంట్ కేడర్‌కు తెలంగాణ రాష్ట్ర సబార్డినేట్ సర్వీస్ రూల్స్, 1996 యొక్క రూల్ నెం.16 (సి) (ఐఐ) వర్తిస్తుందని మార్గదర్శకాల్లో తెలియజేశారు. బదిలీ ద్వారా నియామకం కాబడిన ఉద్యోగులకు ఒక సంవత్సరం ప్రొబేషన్ ఉంటుందని కలెక్టర్లకు జారీ చేసిన ఆదేశాలలో స్పష్టంగా తెలిపారు.

ఉద్యోగుల జెఎసి హర్షం

జూనియర్ అసిస్టెంట్ల సర్వీసు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి లచ్చిరెడ్డి, డిసిఎ జనరల్ సెక్రటరీ కెతావత్ రామకృష్ణ, టిజిటిఎ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ రాములు, రమేష్ పాక, టిజిఆర్ఎస్ఎ అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి వి బిక్షం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సిసిఎల్ఎ కమిషనర్ లోకేష్‌కుమార్, సెక్రటరీ మంద మకరందు ప్రత్యేక చొరవ తీసుకున్నారని పేర్కొన్నారు.

పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు పాటించాలి

- డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ మోహన్ బాబు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రసాయన ఔషధ పరిశ్రమలు, కర్మాగారాలలో పకడ్బందీగా భద్రత ప్రమాణాలు పాటించాలని డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ వై మోహన్‌బాబు అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ (సిఇపి) ఆధ్వర్యంలో పలు పరిశ్రమల ఉద్యోగులకు శనివారం నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ తరగతులలో ఆయన మాట్లాడారు. రసాయన ఔషధ పరిశ్రమలలో ఇటీవల తరచూ ప్రమాదాలతో సంభవిస్తుండడంతో ప్రాణ నష్టం జరిగిందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్మికులకు నిరంతరం భద్రతపరమైన అంశాలపై శిక్షణ కార్యక్రమాలు, మాక్ డ్రిల్స్ నిర్వహించాలన్నారు. కార్మికుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. ప్రతి పరిశ్రమలో భద్రత పట్ల యాజమాన్యం శిక్షణ తరగతులు నిర్వహించాలని, దాంతో చాలా వరకు ప్రమాదాలను నివారించొచ్చని చెప్పారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఇచ్చే నివేదికలు ముఖ్యం కాదని, జీరో ప్రమాదాల స్థాయికి చేరినప్పుడే పరిశ్రమ 100 శాతం అభివృద్ధి సాధించినట్టని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన, భద్రత ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. ఉద్యోగుల శిక్షణకు కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం లేదని, ఇంటర్నెట్‌లో భద్రత ప్రమాణాలపై విషయాలు తెలుసుకొని సైతం కింది స్థాయి ఉద్యోగులకు శిక్షణ ఇవ్వొచ్చని చెప్పారు. ఈ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని నిర్వాహకులను అభినందించారు. కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ (సిఇపి) వ్యవస్థాపకులు, అధ్యక్షులు తపస్ సాహ మాట్లాడుతూ.. నాడు చిన్న వాట్సప్ గ్రూప్‌గా ప్రారంభమైన ఈ సంస్థ నేడు వేల మందితో నడుస్తున్నదని, నిత్యం పరిశ్రమలలో ఎదుర్కొనే సమస్యల పట్ల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యాజమాన్యాలు భద్రత ప్రమాణాల విషయాలలో సహకరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అరబిందో అండ్ ఆపిటోరియా ఫార్మా ఈహెచ్ఎస్ జనరల్ మేనేజర్ అమర్ కూడాలే, బిఎస్ అండ్ బి సేఫ్టీ సిస్టమ్స్ చెన్నయ్ రాష్ట్ర అధ్యక్షులు బి.జయ శంకర్, గ్రాన్యూవల్స్ ఇండియా లిమిటెడ్ ఈహెచ్ఎస్ వైస్ ప్రెసిడెంట్ మెట్లపల్లి శ్రీనివాస్, 3ఎం జిఎం ఎ సందీప్ కుమార్, వియాష్ లైఫ్ సెన్స్ ఇహెచ్ఎస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సాంసన్, కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ (సిఇపి) సభ్యులు ఎ సూర్య ప్రకాష్, ఇ తిరుపతి, పి రామకృష్ణ, చంద్రకాంత్, జి జగదీష్, ఎ మురళీకృష్ణ, హరిబుకియ, సుమారు 72 పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీషర్ట్‌ల ఉత్పత్తిపై కెటిఆర్ హర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో టీ షర్ట్‌ల ఉత్పత్తిపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా హర్షం వ్యక్తం చేశారు. మొదటి యూనిట్ ఉత్పత్తి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచ మార్కెట్లకు టీషర్టులు ఎగుమతి చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 2023లో కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో ఫ్యాక్టరీలకు శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. పదకొండు యంగ్ వన్ కార్పొరేషన్ ఫ్యాక్టరీలకు భూమిపూజ చేశామన్నారు.

బావిలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

- ఎంచగూడెం గ్రామంలో విషాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని ఎంచగూడెం గ్రామంలో ఇద్దరు చిన్నారులు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ప్రాణం కోల్పోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంచగూడెంలో నర్సమ్మ- సారయ్య దంపతుల ఇంటికి దసరా పండుగకి కుమార్తె పిల్లలతో కలిసి వచ్చింది. ఈ క్రమంలో వారి బంధువు చనిపోవడంతో కుటుంబ సభ్యులు వేరే గ్రామానికి వెళ్లారు. ఇటుకాల నర్సయ్య-స్వాతి దంపతుల కొడుకు రితిక్ (10), నర్సయ్య సోదరి అనిత కొడుకు జతిక్ (9) ఇద్దరూ ఇంటి వద్ద ఉన్నారు. ఇంటి పక్కనే ఉన్న వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన పిల్లలు ప్రమాదవశాత్తు అందులో పడిపోయి మృతిచెందారు. పిల్లలు కనిపించకపోవడంతో పక్కింటి వారు వెతికారు. బావి వద్ద చెప్పులు, బట్టలు ఉండటాన్ని గమనించారు. బావిలో గాలించగా ముందుగా రితిక్ మృతదేహం లభ్యమైంది. గ్రామస్తుల సమాచారంతో కొత్తగూడ ఎస్ఐ రాజ్ కుమార్ సంఘటనా స్థలానికి వచ్చారు. గ్రామస్తుల సహాయంతో బావిలో మళ్లీ వెతికి.. జతిన్ మృతదేహాన్ని బయటకు తీశారు.